# ఆరుద్రతో



మధురవాణీ, ఆరుద్ర; కూచుని చదరంగం ఆడుతూ వుంటారు.

**మధుర:** భాగవతుల శంకరశాస్త్రి అని మీ తల్లీ తండ్రీ ముచ్చటగా పెట్టుకున్న పేరుని కాదని యీ పురుగు పేరు పెట్టుకున్నారు. ఏమి విచిత్రం!

**ఆరుద్ర:** ప్రతి కవికీ ఓ కలం పేరు ఫ్యాషన్ నాకా పేరు పౌరుష నామాన్ని మించి సూటయింది

**మధుర:** మీరు కవిత్వాలు రాయకముందే పెన్ నేము పెట్టుకున్నారా?

**ఆరుద్ర:** నీ వేళాకోళానికి కూడా ఓ హద్దూ పద్దూ వుండాలి

**మధుర:** మా విజయనగరం వారు కదా, చిన్నప్పుడు అక్కడే కదా రోణంకి అప్పలస్వామితో, చాసోతో కలిసి మెలసి తిరిగారని మీమీద చనువు తీసుకుంటున్నా నిజానికి మీరే శ్రీశ్రీ కంటె గొప్పవారు ఆ విషయం మీకూ నాకూ మాత్రమే తెలిసిన సీక్రెటు

**ఆరుద్ర:** మళ్లీ ఏదో పెటకం పెడుతున్నట్లున్నావు!

**మధుర:** ఆయన 'రష్యా ఓ రష్యా' అంటూ గోలచేసిన రష్యా యిప్పుడు ఎలా వుందో చూడండి సరే, చైనా అమెరికనయిజుడైంది ఇక కమ్యూనిజం నిజంగా పుస్తకాల్లోనే-

**ఆరుద్ర:** కారల్ మార్క్సు చిరంజీవి

**మధుర:** 'గురజాడ కాదు, యుగకవిని నేనే' అన్న శ్రీశ్రీ పాపం జారుకున్నాడు. మీరు కృష్ణశాస్త్రితోనూ నిలబడ్డారు ఆధునిక కవిగానూ నిలబడ్డారు.

**ఆరుద్ర:** నన్ను చెట్టెక్కిస్తున్నావ్. నీ కొంటెతనం నమ్మడానికి వీల్లేదు

**మధుర:** చెక్కు చెదరని ఆధునిక కవి అనడానికి మీకు త్వమేవాహం ఒక్కటి చాలు కృష్ణశాస్త్రికి కృష్ణపక్షం - ఊర్వశి లాగ.

**ఆరుద్ర:**నన్నెందుకు ఆ మహానుభావుడి పక్కలో చేరుస్తావు.

**మధుర:** ఆయనలాగే మీరూ కన్నింగ్ మరియూ క్లెవర్ కవి కుమారుడికి స్వేచ్ఛ పరమ అవసరం అని అప్పుడెప్పుడో ప్రజాస్వామిక శక్తుల కలయిక అంటూ పద్మరాజు గారితో కలిసి మళ్లీ నాలిక్కర్చుకుని ఎర్ర బావుటా నిగనిగల్లోకి వచ్చి చేరినపుడు మీ స్టెప్స్ గురించి విన్నాం.

**ఆరుద్ర:** నేనేమీ డాన్సర్‌ని కానే, స్టెప్స్ అంటున్నావ్

**మధుర:** అభ్యుదయ రచయితల సంఘంలో మళ్లీ విశ్వనాథవారూ, కృష్ణశాస్త్రిగారూ చేరినపుడు సంఘం లావయిందని సంతోషించారే కాని వాపంతా బలుపు కాదని తెలుసుకోలేక పోయారు

**అరుద్ర:** ఆ గొడవంతా తుమ్మల వెంకట్రామయ్యగారు చూసుకునేవారు.

**మధుర:** అన్నట్టు రావిశాస్త్రి గారితో గొడవేమిటి?

**అరుద్ర:** ఆయన ద్వితీయం చేసుకున్నపుడు చమత్కారంగా ఏదో అన్నా. తర్వాత ఆయన కొంచెం అలిగాడు.

**మధుర:** శ్రీశ్రీ షష్టిపూర్తి సభలో మీరూ అలిగారట?

**అరుద్ర:** రావిశాస్త్రీ లేడు, శ్రీశ్రీ లేడు, అదంతా పాత చింతకాయపచ్చడి. పురాణమిత్యేవ సాధుసర్వం. చాసో సప్తతి ఉత్సవానికి నేను విశాఖపట్నం వెళ్లాను. మమ్మల్ని బాగా గౌరవించారు.

**మధుర:** నారాయణబాబు రుధిరజ్యోతి ముందు పారేసి తర్వాత దొరికితే పుస్తకం వేశార్ట; ఆ గొడవేంటి?

**అరుద్ర:** శ్రీశ్రీకి నారాయణ బాబంటే ఒక విధమైన ఫీలింగు వుండేదనుకుంటా. ఎవరూ తన యిజాల ఎత్తుకు వస్తే సహించేవాడు కాదు. శ్రీశ్రీ కవితలకు వాళ్లవీ వీళ్లవీ ఇన్స్పిరేషన్లు. అసలు సిసలైన మోడ్రన్ పోయిట్రీ నారాయణ బాబే రాశాడు

**మధుర:** ...అని చాసో వ్యగ్గా విజయనగరం వాళ్లు అంటారు. ''చెర్రీ అర్చర్డు''ని 'సంపంగి తోట' అనే పేరుతోనారాయణబాబు చేత రాయించి శ్రీశ్రీ వరదా తమ పేర్లు వేసుకున్నార్ట-

**అరుద్ర:** అబ్బూరి రామకృష్ణారావు గారి జవాబుతో ఆ తగూ సమసిపోయింది.

**మధుర:** మీరు నాస్తికులైవుండి శ్రీరాముడి మీద మంచి పాటలు రాశారు. మీరు వాడుకున్నా వాడుకోకపోయినా స్వర్గంలో బెత్తెడు పుణ్యం మీ పేరజమ అయి కూచుంది. శ్రీరామ నవమికి మీ పాట లేకుండా జరగదు.

**అరుద్ర:** అంతా మార్క్స్ దయ!

**మధుర:** సినిమా పాటలు మీవి జగత్ ప్రసిద్ధాలు. అన్నట్టు మీ సినిమా పాటల్లో సాహిత్యం మారింది. ప్రేమ లేఖలు - రాజకపూర్ సినిమాకు మీరు రాసిన తెలుగు పాటలు ఆ భాషా, శైలీ మరువలేం!

**అరుద్ర:** బొంబాయి వెళ్లి రాశా - 'పందిట్లో పెళ్లవుతున్నాదీ', 'పాడు జీవితమూ యవ్వనం మూడునాళ్లా ముచ్చట లోయీ' - ఇలా చాలా పాటలు జనాన్ని పరవశింప జేశాయి.

**మధుర:** మీరు గురజాడ వ్యావహారిక భాషా ఉద్యమాన్ని చాలా దూరం తీసికెళ్లారు. ఆయన ఋణం తీర్చుగున్నారు.

**అరుద్ర:** నేనూ శ్రీశ్రీ కలిసినపుడు వరసగా ఎంతసేపయినా కన్యాశుల్కం డైలాగులు వప్పజెప్పుగున్నట్లు పలికే వాళ్లం. అన్ని సందర్భాలకూ చక్కగా అతికేవి.

**మధుర:** మీరు ఇంగ్లండు పర్యటించారట గదా!

**అరుద్ర:** జమలాపురం కేశవరావు గారి అబ్బాయి డాక్టరు, బర్మింగ్ హామ్‌లో. నేనూ

పురాణం, సోమసుందర్ అక్కడే కలుసుగుంట. శర్మని నేనే, లండన్‌లో తిప్పి అన్నీ చూపించింది. గూటాల కృష్ణమూర్తిగారింట్లో దిగాం. వ్యావహారిక భాషకు డిష్నరీ వ్రాసిన గ్రిన్ దొరగార్ని అక్కడే కలుసుగున్నాం. స్పేనియార్డ్స్ ఇన్ డికెన్స్ నవలలో చెప్పిన హాంస్టెడ్‌లో తిరిగాం. ఛార్లెస్ అండ్ మేరి లాంబ్ కాలం నాటి పబ్‌లో బీరు తాగాం.

**మధుర:** అసలు మీకూ శ్రీశ్రీకీ ఎక్కడ వచ్చింది పేచీ?

**ఆరుద్ర:** మాకు విభేదాలు లేవు. అన్నీ కల్పితాలే. ఏవో పొరపొచ్చాలు వచ్చినా మా సంబంధాలు బెడిసిపోలేదు. రాజకీయంగా అతనిది ఓ మార్గం, మాది మరోమార్గం.

**మధుర:** తగూలు ఆడవాళ్ల వల్ల వస్తాయని అంటారు.

**ఆరుద్ర:** సినిమా వాళ్లు కూడా తగూలకు కారణం అవుతూంటారు.

**మధుర:** మీరు సమగ్ర ఆంధ్ర సాహిత్యం రాశార్ట. కవిత్వం ఏదో రాసుకోక యీ చరిత్రా రీసెర్చీయేమిటి?

**ఆరుద్ర:** అదో పెద్ద ప్రాజెక్టు. డబ్బు నాలుగు రకాలుగా - నాలుగు మార్గాల గుండా వస్తేనే కదా, సంసారం గడుస్తుంది నిశ్చింతగా

**మధుర:** మీ శ్రీమతిగారు కూడా పెద్ద రైటరు యమ్వీయల్ కొన్నాళ్లు మీ దగ్గర వుండేవార్ట

**ఆరుద్ర:** నిజమే - ఎమ్వీయల్ ఒక అద్భుతమైన చిన్నవాడు చాలా కుశాగ్ర బుద్ధి అతనూ పురాణం కలిసి మినీ పొయిట్రీ కొత్తగా ప్రారంభించారు. నేనూ చాలా రాశా

**మధుర:** మీరు గడ్డం యెందుకు పెంచారు?

**ఆరుద్ర:** సమగ్ర ఆంధ్ర సాహిత్యం పూర్తయేదాకా గడ్డం తీయరాదని అనుకున్నా అంతకు ముందు మామూలుగా వుండేవాణ్ణే.

**మధుర:** ఈ బైరాగి డ్రెస్సు కూడా ఆ సమగ్ర ఆంధ్ర సాహిత్యం బాపతేనా-

**ఆరుద్ర:** ఇది చవక గుర్తుపట్టడం తేలిక

**మధుర:** గడ్డాన్ని మెయిన్‌టైన్ చెయ్యడం అంత తేలిక కాదు చెళ్ళపిళ్ళ వారికి గడ్డం వుండేది. కాశీ కృష్ణాచార్యుల వారికి గడ్డం వుండేది 'షా'కు వుండేది

**ఆరుద్ర:** ఇంత తొందరలో నన్ను పెద్దవాళ్లలో చేర్చకు.

**మధుర:** మీరో డిటెక్టివ్ నవల రాశారనుకుంటా.

**ఆరుద్ర:** 'పలకల వెండి గ్లాసు' లాంటివి పదో పన్నెండో.

**మధుర:** ఇంటింటి పజ్యాలు రాసింది మీరేగా?

**ఆరుద్ర:** రాఘవయ్యగారి జ్యోతిలో

**మధుర:** మీకు మ్యాజిక్కులు తెలుసునుకుంటా

**ఆరుద్ర:** రాఘవయ్య గారమ్మాయికే నేర్పా. ఇప్పుడామె నిజంగా మంచి డాక్టరు.

**మధుర:** మీ కుమార్తెలు ఎవరూ మీ దారిన రాలేదా.

**ఆరుద్ర:** మా రౌద్రి కవిత్వం రాస్తే శ్రీశ్రీ ఇంట్రో రాసి ఆశీర్వదించాడు.

**మధుర:** మీరు సిగరెట్లు కాల్చేవారా?

**ఆరుద్ర:** పూర్వం గడ్డానికీ సిగరెట్లకూ చుక్కెదురు.

**మధుర:** సోమసుందర్ మీకు తెలుసా?

**ఆరుద్ర:** సాటికవే - తెలుసా ఏమిటి.

**మధుర:** మీ త్వమేవాహం అతనే వేశాడు గావును మొదట.

**ఆరుద్ర:** నేను సినిమా పాటలు రాసి బాగా వున్నానని అతను కూడా మద్రాసు వచ్చి పాటలు రాయాలని ప్రయత్నించి పలకక తిరిగి పిఠాపురానికి రైలెక్కాడు. అప్పుడు నేను ఒక సాంగ్ సెషన్‌లో ఇరుక్కుని వెళ్లి రైలెక్కించలేక వూరుకున్నా.

**మధుర:** అతను ఫీలయి వుంటాడు బాగా.

**ఆరుద్ర:** ఆ సందర్భం అలా వచ్చింది నేను నిస్సహాయుణ్ని.

**మధుర:** ఒక్క పాట కూడా యివ్వలేదా పాపం!

**ఆరుద్ర:** సినిమా ప్రపంచం అన్నాడు గదా, శ్రీశ్రీ . .

**మధుర:** ఈ ప్రపంచంలో ఎవడిదగ్గర వున్నదాన్ని వాడుయిచ్చి - తనక్కావలసింది తీసుకుంటాడు.

**ఆరుద్ర:** ఆ కావలసింది డబ్బు. లచ్చి తల్లికి జాతి భేదం లేదన్నాడు రావిశాస్త్రి.

**మధుర:** డబ్బు ముఖ్యమే కాని డబ్బు కోసం రాయడం పాపం కాదా?

**ఆరుద్ర:** రాయడం ఒకప్పుడు బతకడం కోసం. బతకడానికి అన్నీ కావాలిగా.

**మధుర:** శ్రీశ్రీగారు మీ వద్ద అప్పు చేసేవారా?

**ఆరుద్ర:** ఆయన నాకు మేనమామ. మావా అల్లుళ్ల మధ్య అనేక వ్యవహారాలుంటాయి అవన్నీ నీకెందుకు?

**మధుర:** మనవంతా ఒక వూరి వాళ్లం కదా- యోగక్షేమాలు తెలుసుకోవడంలో మీరంత టచ్చీ అవుతారెందుకూ? నాకు తెలిసినంత మేరకు శ్రీశ్రీగారికి డ్రింకాపేక్ష ఎక్కువ. అన్నట్లు ఆరుద్ర అంత్యక్రియలికి ప్రసిద్ధి అని అంటారు లోకం.

**ఆరుద్ర:** అంత్యక్రియలు కావు ఖర్మ - ''అంత్యప్రాసలారుద్రవి'' అని పేరు.

**మధుర:** మిమ్మల్ని బలమైన కంఠంగల యీ శతాబ్దపు కొరకరాని కొయ్య అన్నారు త్వమేవాహం ముందు మాటలో - పాపం, చిత్రకవులకీ పదబంధ కవులకీ మీకూ మౌలికంగా తేడా యేమిటీ అని ఆలోచిస్తున్నా.

**ఆరుద్ర:** నేను మోడ్రన్ని. వాళ్లు పాతవాళ్లు. సమాజ క్షేమం నా లక్ష్యం.

**మధుర:** తెలుస్తోంది. మీరు సామాజిక స్పృహ గాళ్లని. అసలైన కవిత్వం ప్రజలమీద వానలాగ కురవాలి. విశ్వనాథవారు 'వానలో తడియని వారు, మద్గురు మృదూక్తి మరంద ధారలో తనియనివారు లేరనుట సిద్ధము నైజము తెన్గునాడునన్' అన్నారు. పాఠకుని హింసపెట్టడం కవిత్వమా?

**ఆరుద్ర:** అది కవిత్వానికి హ్రస్వ లిపి. అది అర్థమైతే 'త్వమేవాహం' అర్థం అవుతుంది.

**మధుర:** మీలోని యాంగ్జయిటి, కన్ఫ్యూఝన్ అంతా 'త్వమేవాహం'లో వుందనుకుంటా-

**ఆరుద్ర:** 1948లో రజాకార్లచే చెరబడ్డ స్త్రీ కథనం కృష్ణాపత్రికలో చదివి 'త్వమేవాహం' మొదలెట్టా. అదే తెలంగాణాలో సాయుధ పోరాటంగా మారింది.

**మధుర:** ఇక నేను పద్యాలు రాయనవసరం లేదన్నాడట - శ్రీశ్రీ

**ఆరుద్ర:** అప్పటి అభిమానం అలా అనిపించి వుంటుంది!

**మధుర:** సినిమా ధనస్వామ్యం మిమ్మల్ని తెలివిగా తనవైపు లాగేసుకుని వుంటుంది

**ఆరుద్ర:** నన్ను లాగేసుకుంది రామలక్ష్మిగాని ధనలక్ష్మి కాదు.

**మధుర:** శ్రీశ్రీ నుంచి ఎడంగా ఆమె లాగేసి వుంటుంది

**ఆరుద్ర:** ఆయన నక్సలైట్ల దాకా వెళ్లాడు; నేను ప్రజాస్వామ్యం వద్ద ఆగాను

**మధుర:** మన దేశంలో ప్రజాస్వామ్యం ధనిక స్వామ్యానికి ముసుగు

**ఆరుద్ర:** జీర్ణమంగే సుభాషితం అని వొకప్పుడు 'త్వమేవాహం' రాశాక నిరాశ చెందాను. నా కవిత్వం రుద్రాక్ష పాకంలో వుంటున్నదన్నారు నాకు ఆనందాన్నిచ్చే తానం వాయించుకోక పురజనుల కోరికమీద అల్లాటప్పా పాటలు వ్రాయించే స్థితికి వచ్చా. సజ్జల కవిత్వం రాశా

**మధుర:** ప్రజా కవిత్వం వేరూ అభ్యుదయ కవిత్వం వేరూ అంటే మీ మిత్రులకి మీమీద కోపం వచ్చిందని విన్నా

**ఆరుద్ర:** బండివాడి పాట అర్థమైనట్టు మహాప్రస్థానం లోది అర్థం కాదు కదా - 'అప్పనాతనామనా' అర్థమైనట్లు 'రామ నీ సమాన మెవరు' త్యాగరాజ కీర్తన ఎలా అర్థం అవుతుంది?

**మధుర:** ఆ మూఢనమ్మకాలని మీరు మార్చలేరు. ఒక కవిని మరొక సహృదయుడైన కవి అర్థం చేసుకున్నట్లు సామాన్యులు ఎలా అర్థం చేసుకుంటారు? వాలు కుర్చీ కవులు కళ కళకోసమే, కోన్‌కిస్కాగాళ్ల కోసం కాదని అంటారు.

**ఆరుద్ర:** 'త్వమేవాహం'లో కావ్యాన్ని ప్రవాహంగా వూహించి పర్వతదశ, ఉపనదులు, ప్రవాహదశ, రాసేక నదీ ముఖద్వారాన్నీ సాగరసంగ మాన్నీ రాద్దామని మానేశా. కాలానికి సంకేతం గడియారం. గడియారం మన సంఘం. గంటలు శ్రీమంతులు. నిముషాలు

మధ్యతరగతి వాళ్లు. సెకండ్లు 'అలగా' జనం. చిన్న ముల్లు శ్రీమంతుల మనస్త త్వానికి సూచి. పెద్దముల్లు మిడిల్ క్లాసు వాళ్ల భావానికి బరామీటరు. సెకండ్ల ముల్లు శ్రామిక జనుల ఫిలాసఫీకి కొలబద్ద. ఇసక గడియారం, నీటి గడియారం పాతకాలపు సంఘాలు. స్టాప్ వాచీ విప్లవాన్ని టైం చేసే సాధనం. పెండ్యులం చెప్పనక్కర్లేదు-

**మధుర:** ఈవిధమైన సంకేతాలు మీరు మాకు చెప్పకుండా ఎలా తెలుస్తాయి?

**ఆరుద్ర:** 1948వ సంవత్సరం, జూలై నెల పదవ తారీకు కృష్ణాపత్రికలో "నాకా సిగ్గు? నా స్త్రీత్వం ఎప్పుడో పోయింది!" అనే పతాకతో రజాకార్ల చేత చెరచబడ్డ స్త్రీ కథనం పడ్డాది. "సుమారు పన్నెండు రోజుల క్రిందటి విషయం. రైలు గుడివాడ దాటుతోంది. ఇందుపల్లె సమీపంలోకి వచ్చింది. రైలు పెట్టెలో వున్న ప్రయాణీకులు హైదరాబాదు విషయాలు చెప్పుగుంటున్నారు. రజ్వీ దురంతాలూ కాందిశీకుల కష్టాలూ వర్ణించి విషాదభరి తులవుతున్నారు. ఇంతలో ఆ పెట్టెలో వున్న ఒకావిడ లేచి నిలబడింది. వలువలు తీసివేసింది. ఏమిటీ ఘోరం అని అంతా తలలు వంచుకున్నారు. ఆమె అలాగే నిలబడింది ఆ పెట్టెలో వున్న ఒక వృద్ధుడు ధైర్యం చేసి - "అదేమిటమ్మా - ఆడపిల్లవు అలా నగ్నంగా వున్నావు తప్పుకాదూ-" అన్నాడు. ఆ మాటలో ఆమె తోకతొక్కిన తాచురీతిగా లేచిందట - "తప్పా - నాకు తప్పా - ఏనోటితో చెప్తున్నారామాట - నేను ఆడదాన్నా - నైజాం కిరాతకులు నన్ను వారం రోజులిలా నగ్నంగా చెట్టుకు కట్టేసి అట్టే పెట్టారు నా స్త్రీత్వాన్ని ఆనాడే దొంగిలించారు. నా ఆడతనం ఆనాడే పోయింది ఇంకా ఆడదానివంటారేమిటి - చూడండి నా వంటినిండా గాయాలు స్త్రీత్వం ఒకసారి పోయిన తరువాత మళ్లీ వస్తుందా - ఇలా వున్నది మా స్థితి! మీరిలా కూర్చుని కబుర్లు వింటున్నారు నేనేం సిగ్గుపడవలసినది లేదిక. మీరూ, పడవలసినది!... అని ఒక్కొక్క ప్రయాణీకుడి దగ్గరికి వచ్చి తన వొంటికి వున్న గాయాలు చూపించింది పెట్టెలో వున్న వాళ్లంతా సిగ్గుతో తలలు వంచుగున్నారు ఆమె విషాద గాథ విని కన్నీరు కార్చారు. తరువాత ఆమె వలువలు ధరించి వెళ్లి ఒకచోట కూర్చుంది. ఆమె అలా అప్పుడప్పుడు అన్ని తరగతుల రైలు పెట్టెలలోకి వెళ్లి ప్రచారం చేస్తున్నదని తెలిసింది

**మధుర:** ఇటువంటి నిజాం ప్రభుత్వాన్ని, వ్యవస్థను నెహ్రూగారు తమ పోలీసు యాక్షన్‌తో కైవసం చేసుగుని నిలబెట్టి కాంగ్రెసులో కలిపేశారు ఈ దుర్మార్గపు వ్యవస్థను ఛీ!ఛీ!

**ఆరుద్ర:** తెలంగాణాకు పోలీసు చర్యను పూర్వం స్పేనిష్ సివిల్ వార్‌తో పోల్చవచ్చు. 'స్ప్రయినల్ కార్డులో స్ప్రెయిన్' అనే మాటకు అంతరార్థం పైన చెప్పిన కథ. తెలంగాణా విప్లవమే నా కావ్యానికి ప్రధాన యితివృత్తం కాదు. కాలం ప్రధాన వస్తువు-

**మధుర:** అభ్యుదయ కవిత్వం యేమీ వద్దు. మీరు శుభ్రంగా ప్రజాకవిత్వం రాయండి. 'పాషాణ పాక ప్రభూ!' అని మిమ్మల్ని అనాలి నిజానికి!

**ఆరుద్ర:** అక్రమం జరగడం కవితకు నాంది అనేది ముఖ్యం

**మధుర:** విడాకులేకుండా విడో మేరేజీ లేనట్టు 'ముందు విడో కానిమ్మా, తరవాత పెండ్లి యాడెదను' అన్నాడు గిరీశంగారు.

**ఆరుద్ర:** నాకు అతగాడితో చుట్టరికం కలపకు, నీకు పుణ్యం వుంటుంది కవిత్వం జీవితాలకి వెలుగు చూపించాలి.

**మధుర:** మీ కవిత్వం వెన్నెట్లో టార్చిలైటు కారాదు చక్రాల్లో చెక్రాలున్నట్లు అర్థాల్లో అంతర్థాలుంటాయి అంటారు శ్రీశ్రీ.

**ఆరుద్ర:** కల నిజపరచడం కాదు కవిత్వం నిజాన్ని కలగనడమే దాని తత్వం. మెదడూ హృదయం మిళితమయే గుణం - అదే మహాకావ్యానికి ఏకైక లక్షణం అన్నాడు మా మావయ్య.

**మధుర:** నార్లగారి లైబ్రరీ గొప్పదా, మీదా?

**ఆరుద్ర:** ఎవరి లైబ్రరీ వారికే ముద్దు!

**మధుర:** కేవలం కవిత్వ పిచ్చిలోనే పడకండా మీరు స్కాలర్ మరియూ రీసెర్చి స్కాలర్ ముసుగును కూడా ధరించారు కదా!

**ఆరుద్ర:** స్కాలరేవిటి, ముసుగేవిటి?

**మధుర:** హోమియోపతీ వైద్యుడ్ని డాక్టరంటే సంతోషిస్తాడు. మిమ్మల్ని పండితుడు అనకుండా స్కాలరన్నాను శ్రీశ్రీ కూడా స్కాలరే అయినా మీలా పండితుడు కాదు.

**ఆరుద్ర:** నేను పత్రికా రచయితను ఒకప్పుడు నేనూ శ్రీశ్రీ ఆనందవాణి ఎడిట్ చేశాం. ఆ రోజుల్లోనే పురాణాన్ని నేను 'గోడమీద సాలీడు' రచనతో డిస్కవర్ చేశా.

**మధుర:** అయన మీ శిష్యుడా?

**ఆరుద్ర:** చెప్పలేను కాని నేను మాత్రం ఆయన గురువుని. మేమిద్దరం లండన్‌లో, బర్మింగ్‌హామ్‌లో కలిసే తిరిగాం నేనాతని గైడ్‌ని

**మధుర:** తెలుగువాళ్లతో సుబ్రమణియ భారతి గారి స్నేహాన్నీ ప్రేమనీ మీరు వ్యాసాలలో బాగా బైటపెట్టారు.

**ఆరుద్ర:** భారతదేశం మొత్తాన్ని సమైక్యంగా చూసిన తమిళ మహాకవి భారతి 'జాతీయ సమైక్యత' అని గవర్నమెంటు స్లోగన్ పుట్టించకపూర్వం ఊహించి కలగన్నాడతను.

**మధుర:** ఇప్పుడు ఆ తమిళులే ఎల్ టి టి ఇ వాళ్లతో చేరి జాతీయ సమైక్యతకు మంగళం పాడేస్తున్నారు రాజీవ్ గాంధీని పొట్టన పెట్టుకున్నారు. విశాల దృక్పథం లేని వాళ్లు జాతిని ముందుకు నడిపించలేరు ఇప్పుడు తమిళనాడు పీతలా అడ్డంగా నడుస్తోంది.

**ఆరుద్ర:** రాజభాష ఉన్నత వర్గాల వారివల్ల మాతృభాష శ్రామికుల వల్ల పెంపొందుతాయి, నిజంగా. గురజాడ వారు మదరాసు తెలుగు భాషకు సవతి తల్లి అన్నారు. అది ముమ్మాటికీ నిజం

**మధుర:** నేటి తమిళులకు విశాల దృక్పథం లేదు అనేది నిజం. అవసరమైతే వారు వేరింటి కాపరానికి సిద్ధం. ప్రత్యేకత వేరు; వేరుగా వుండ కోరడం వేరూ-

**ఆరుద్ర:** వారి రాజకీయాలు మనకు వద్దు. తెలుగు స్కూళ్లు లేకుండా చేసిన ఘనత

వారిది. మదరాసులో తెలుగు వారిని ఎంత చిన్నచూపు చూసినా ''కుంచం తిరగేసి కొలిస్తే చేరడు మాకలేనా మిగులుతా''యని వూరుకునే మనస్తత్వం పోవాలి.

**మధుర:** చెన్నప్ప అనేవాడు తెలుగువాడు. చెన్నపట్టణం యిప్పుడు 'చెన్నై'గా మారింది. అయితే హిందీ దుర్మార్గాన్ని వ్యతిరేకించడంలో తమిళులు చాలా గొప్పవారు. అన్నట్లు పెద్ద బాలశిక్ష ఎవరు రాశారో చెప్పండి

**ఆరుద్ర:** పుదూరు సీతారామశాస్త్రి గారు. ద్రావిడ బ్రాహ్మణులు. ద్రావిడ బ్రాహ్మణుల్లో పుదూరు ద్రావిళ్లు, కరువది ద్రావిళ్లు, దిమిలి ద్రావిళ్లు వున్నారు అంతేగాని పుదూరు ఇంటి పేరు కాదు అసలింటిపేరు చదలవాడ బ్రౌన్ దొరగారి వద్ద ముఖ్య పండితులు కొన్ని కోట్ల ప్రతులు ముద్రితమైన పుస్తకం ఇది

**మధుర:** మీరు ఆంధ్ర ఆస్థాన కవిగా వుండతగినవారని నా అభిప్రాయం.

**ఆరుద్ర:** థాంక్స్! నేను వుండేది మదరాసులో. అన్నట్లు అక్కడ మన నారాయణ రెడ్డి వున్నాడు గదా!

**మధుర:** ఆంధ్రుల మనసులలో కొలువుండదగిన వ్యక్తిత్వం మీది. పైకి 'షా'లా గడ్డం అదీ మీరు సూటవుతారు మహాకవి కొలతలకు కూడా.

**ఆరుద్ర:** ఉత్తర భారతంలో మనకు ఉప్పూ పత్రీ లేని రోజుల్లో దక్షిణాదిని మాత్రం సంగీత నాట్యరంగాలను తెలుగే యేలుతూ వుండేది. శతాబ్దాల తరబడి నాయక రాజుల పాలనలో తెలుగు సామ్రాజ్యాధికారం సాంస్కృతిక రంగాలలో కూడా విస్తరించింది. వాగ్గేయకారులు ఏ భాష వారైనా తెలుగులో రచనలు చేసేవారు సామ్రాజ్యం పోయినా సంప్రదాయం అలానే వుండిపోయింది

**మధుర:** కదన కుతూహల రాగంలో పాడే 'రఘువంశ సుధాంబుధి చంద్రమా', ఎవరు చేశారు?

**ఆరుద్ర:** పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ గారు చేశారు కచేరి బాణీ సంగీతానికి ఆయన మూలపురుషుడు. ఇందులో రాగం - తానం - పల్లవి ముఖ్యాలు.

**మధుర:** దక్షిణాది సంగీతాన్ని కర్ణాటక సంగీతమని ఎందుకంటారు?

**ఆరుద్ర:** చెవులకింపైన సంగీతం అని అర్థం మనోధర్మ సంగీత ప్రదర్శనకు యిదే అనువైనది ఎవరు ఆదరిస్తే ఆ రాజుల పేరుతో చలామణీ అవుతుంది.

**మధుర:** మీ 'క్లార్కు సూర్యారావు' వల్ల ప్రేరణపొంది ఆత్రేయ యన్.జీ.వో. రాశాడంటారు నిజమా?

**ఆరుద్ర:** ఇలా అనుకోడం చిన్న పిల్లల మనస్తత్వానికి దగ్గర మధ్యతరగతి మనిషి మిథ్యా జీవితాన్ని ఎవరు ఏవిధంగా చిత్రించినా ఆదరణీయమే -

**మధుర:** మీకు పజిల్సు అంటే యిష్టమా?

**ఆరుద్ర:** 'గళ్ళ నుడికట్టు' నాకిష్టమైన క్రీడ.

**మధుర:** సినీవాలీ అనే మాటమీద జారిపోయి మీరో కావ్యం రాసి పారేశారు. అలా కావ్యం రాయడం ఒక సర్కస్ ఫీటు కాదా?

**ఆరుద్ర:** ఏది ఏమైనా కావ్యం బాగుందా లేదా అనేది చూడాలి. చంద్రకళ కనబడే అమావాస్యను సినీవాలి అంటారు. పార్వతిని కూడా సినీవాలి అంటారు. ఆశా చంద్రకళ గల యిది సినీవాలి అనడం ఒప్పు అన్నా చివరలో.

**మధుర:** తప్పొప్పుల పట్టిక - స్వవిషయ సూచిక అన్న పేర్లు చాలా బావున్నాయి. కొత్తదనం ఆరుద్ర అనవచ్చు ననుకుంటా. మీ కవిత్వాన్ని చూసి కృష్ణశాస్త్రి గారేమను కుంటారు?

**ఆరుద్ర:** ఆకలి కేకల కవిత్వంలో సుతిమెత్తని మాటల పొందిక ఎలా కుదురుతుంది చెప్పు

**మధుర:** జాషువా, కరుణశ్రీలు భావకవిత్వ యుగానికీ అభ్యుదయ కవిత్వ యుగానికీ మధ్య సరిపడతారనుకుంటా-

**ఆరుద్ర:** అదంతా చరిత్రకారులు, పరిశోధకులు తేల్చవలసినది మరి విశ్వనాథవారు మాకు సమకాలికులు. వారు నిజానికి పూర్వయుగానికి చెందినవారిలా కనిపిస్తారు

**మధుర:** తిలక్ గురించి ఏమంటారు?

**ఆరుద్ర:** ఆయన రసగంగాధర తిలక్ అంటా

**మధుర:** గురజాడవారు వేసవి దారిని ముందుకెళ్ళిపోతూ విశ్వనాథ వారిని వదిలేశారు వెనక.

★

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక: 9-08-96)*